


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 268, పేజీలు - 08

సోమవారం, మార్చి 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## ఇది మీ ప్రభుత్వం,
# నేను మీ సోదరుడిని

### - ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'రంజాన్ కేవలం పండుగ కాదు, ఆత్మ శుద్ధి చేసుకునే సమయం. మనుషుల మధ్య సోదరభావం, మతాల మధ్య సామరస్యం తెలంగాణ సంస్కృతి. ఆ సంస్కృతిని అందరం కలిసి కాపాడుకోవాలి'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ముస్లింల సంక్షేమం పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. అజరుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చాం. సీనియర్ నేత షబీర్ అలీ కి సలహాదారు పదవి ఇచ్చాం. ఎనిమిది కార్పొరేషన్లకు మైనారిటీ నేతలను ఛైర్మన్లు చేశాం. క్రికెటర్ సిరాజ్ కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. బాక్సర్ నిక్కత్ జరీన్ కు రెండు కోట్ల రూపాయలు ఇచ్చి ప్రోత్సహించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రభుత్వం మీది , నేను అందరివాడిని మీ సోదరుడిని. ప్రతి ఒక్కరి సహకారంతో ఈ ప్రభుత్వం నడుస్తోంది. మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని మతాలు ఐక్యంగా ఉండటమే తెలంగాణకు శ్రీరామరక్ష. అందరి తోడ్పాటుతో దేశం లో తెలంగాణను అభివృద్ధి లో ముందు వరుసన నిలబెడతాం'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2లో..




## అసెంబ్లీ ఎన్నికలకు
# మోగిన నగారా

### - పశ్చిమ్ బెంగాల్‌లో రెండు విడతలు
### - మిగతా నాలుగు చోట్ల ఒకే దశలో పోలింగ్





**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఎన్నికల

2లో..

## ప్రతిపక్షాలకు ఆయుధంగా
# పుట్టా మహేష్ డ్రగ్స్ వ్యవహారం

### - చంద్రబాబు సంచలన నిర్ణయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** మొయినాబాద్ లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీ తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించింది. ఈ డ్రగ్స్ పార్టీలో ఏలూరు టిడిపి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఉండడం ఏపీ రాజకీయాలలో చర్చనీయాంశమైంది. మొదట పుట్ట మహేష్ కుమార్ యూరిన్ శాంపిల్స్ లో డ్రగ్స్ నెగిటివ్ రాగా, బ్లడ్ శాంపిల్స్ లో డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది.

#### చంద్రబాబుకు తలనొప్పిగా మారిన టీడీపీ ఎంపీ వ్యవహారం

ఇప్పుడు డ్రగ్స్ తీసుకున్న ఏలూరు ఎంపీ, అందులోనూ అధికార టిడిపి ఎంపి పుట్ట మహేష్ కుమార్ వ్యవహారం చంద్రబాబుకు తలనొప్పిగా తయారైంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో వైఫల్యాలను అడుగడుగునా వైసిపి నాయకులు టార్గెట్ చేస్తున్నారు. ఇక ఈ తాజా వ్యవహారం వైసీపీ చేతికి అస్త్రాన్ని అందించినట్టుగా తయారైంది. వైసిపి నాయకులు టిడిపిని టార్గెట్ చేస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు.

#### టీడీపీ తెలుగు డ్రగ్స్ పార్టీ అంటూ వైసీపీ టార్గెట్

ఏపీ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం, తమ ప్రభుత్వం లోనే ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్న డ్రగ్స్ ఎంపీ పైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని గుర్తు చేస్తుంది. టిడిపి పేరును తెలుగు డ్రగ్స్ పార్టీగా మార్చాల్సిన

2లో..

## డ్రగ్స్ టెస్టుకు
# నేను సిద్ధం

### - కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ అజీజ్‌నగర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. ఈ కేసులో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయని, కేటీఆర్ డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం కావాలని మహేష్ కుమార్ గౌడ్ అంతకుముందు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన

2లో..

# మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ కలకలం

### - టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఆరుగురికి పాజిటివ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో ఉన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ (ఏలూరు)తో పాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నమిత్, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలింది. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు నెగటివ్ రాగా, బ్లడ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. దాంతో డ్రగ్ టెస్టులో మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని ప్రకటించారు. ఈగల్ ఫోర్స్ నిర్వహించిన మెరుపు దాడుల్లో నిందితులు తుపాకీతో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి

2లో..



# 2027 పద్మ అవార్డులకు నామినేషన్లు ప్రారంభం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు-2027 కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి 2026 జూలై 31 చివరి తేదీ అని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు లేదా సిఫార్సులను కేవలం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. 1954లో ప్రారంభమైన ఈ పురస్కారాలను పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు కేటగిరీలలో ఏటా అందిస్తున్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని ఈ అవార్డులతో సత్కరిస్తారు

2లో..

## దుష్ప్రచారాలు
# నమ్మవద్దు

### - డ్రగ్స్ వ్యవహారంపై తొలిసారిగా స్పందించిన పుట్టా మహేశ్




**హైదరాబాద్ / ఏలూరు (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మొయినాబాద్ ఫాం హౌస్‌లో శనివారం రాత్రి జరిగిన పార్టీపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పందించారు. ఈ కేసులో తనపై వచ్చిన కథనాలను టీడీపీ ఎంపీ తీవ్రంగా ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగించుకుని హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకున్న పుట్టా మహేష్ కుమార్ మీడియాకు వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. 'నేను ఎలాంటి వ్యక్తినో రెండేళ్లుగా ఏలూరు ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అందరికీ తెలుసు. నాకు ఎటువంటి దురలవాట్లు లేవు.

2లో..

## ప్రశాంత వాతావరణంలో
# అసెంబ్లీ సమావేశాలు జరగాలి

### - అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. బడ్జెట్ సమావేశాలు అత్యంత ప్రాధాన్యతమైనవి. ఎక్కువ రోజులు జరగడంతో పాటుగా, ఎక్కువ సమయం పాటు జరుగుతాయి' అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రేపటి నుండి అసెంబ్లీ,శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మరియు శాసనమండలి కార్యదర్శి వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ

2లో..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై
# కవిత సీరియస్

### - కోర్టుకు లాగుతానంటూ ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయనపై డిఫమేషన్ కేసు వేసి కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో కవిత కీలక

2లో..

## కాన్షీరామ్‌కు
# 'భారతరత్న' ఇవ్వండి

### - ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, బహుజన నేత కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. వారి ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని

2లో..

# అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా

షెడ్యూల్‌కు ముందు రాజకీయ పార్టీల నేతలతో, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు స్వీకరించామని జ్ఞానేశ్ కుమార్ వివరించారు. ఈ ఐదు ప్రాంతాల్లో మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మే 4న జరిగే కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

### పశ్చిమ బెంగాల్ (మొత్తం స్థానాలు: 294)
### రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

తొలి దశ: (152 స్థానాలకు ఎన్నికలు)
నోటిఫికేషన్: మార్చి 30
నామినేషన్ల చివరి తేదీ: ఏప్రిల్ 6
నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 7
ఉపసంహరణ చివరి తేదీ: ఏప్రిల్ 9
పోలింగ్: ఏప్రిల్ 23
ఓట్ల లెక్కింపు మే 4

రెండో దశ: (142 స్థానాలకు ఎన్నికలు)
నోటిఫికేషన్: ఏప్రిల్ 2
నామినేషన్ల చివరి తేదీ: ఏప్రిల్ 9
నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 10
ఉపసంహరణ చివరి తేదీ: ఏప్రిల్ 13
పోలింగ్: ఏప్రిల్ 29
ఓట్ల లెక్కింపు మే 4

### తమిళనాడు (మొత్తం స్థానాలు: 234)

ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి.
నోటిఫికేషన్: మార్చి 30
నామినేషన్ల చివరి తేదీ: ఏప్రిల్ 6
నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 7 ఉ
పసంహరణ చివరి తేదీ: ఏప్రిల్ 9
పోలింగ్: ఏప్రిల్ 23
ఓట్ల లెక్కింపు మే 4

### కేరళ (మొత్తం స్థానాలు: 140)

ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి.
నోటిఫికేషన్: మార్చి 16
నామినేషన్ల చివరి తేదీ: మార్చి 23
నామినేషన్ల పరిశీలన: మార్చి 24
ఉపసంహరణ చివరి తేదీ: మార్చి 26
పోలింగ్: ఏప్రిల్ 9
ఓట్ల లెక్కింపు మే 4

### అసోం (మొత్తం స్థానాలు: 126)

ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి.
నోటిఫికేషన్: మార్చి 16
నామినేషన్ల చివరి తేదీ: మార్చి 23
నామినేషన్ల పరిశీలన: మార్చి 24
ఉపసంహరణ చివరి తేదీ: మార్చి 26
పోలింగ్: ఏప్రిల్ 9
ఓట్ల లెక్కింపు మే 4

### పుదుచ్చేరి (మొత్తం స్థానాలు: 30)

ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి.
నోటిఫికేషన్: మార్చి 16
నామినేషన్ల చివరి తేదీ: మార్చి 23
నామినేషన్ల పరిశీలన: మార్చి 24
ఉపసంహరణ చివరి తేదీ: మార్చి 26
పోలింగ్: ఏప్రిల్ 9
ఓట్ల లెక్కింపు మే 4

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కవిత సీరియస్

వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైడ్రా అనే మహమ్మారి మొదలైందని అది పేదలను కబళిస్తోందని అన్నారు. మూసీలో నిర్మించిన ఆదిత్య కన్ స్ట్రక్షన్ కు చెందిన బిల్డింగ్ వద్ద ఇటీవల నిర్వహించిన ధర్నాపై హైడ్రా తప్పుడు ప్రచారం చేసిందని కవిత మండిపడ్డారు. గతంలో రంగనాథ్ చేసిన ఆరోపణలనే చేస్తూ తాను ధర్నా చేస్తే తనపై తప్పుడు ప్రచారం చేస్తారా.? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ సరిగ్గా ఆరు నెలల క్రితమే ఇదే ఆదిత్య కన్ స్ట్రక్షన్ బిల్డింగ్ యాజమాన్యం 0.37 ఎకరాలు ఆక్రమించిందంటూ తహసీల్దార్ కు రాసిన లేఖను ప్రస్తావించారు. అంతేకాకుండా ఈ భవన నిర్మాణాన్ని ఆపకపోతే అందులో ఉండేబోయే వారితో పాటు ఆ చుట్టుపక్కల ప్రజల ప్రాణాలకే ప్రమాదమని లేఖ రాయలేదా..? అని కవిత ప్రశ్నించారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను తాను సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించారు. అప్పుడు రంగనాథ్, కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడైనా దూకి చావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు తన ధర్నాకు సంబంధించి హైడ్రా పెట్టిన వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా కోర్టుకు ఈడుస్తానని రంగనాథ్ ను కవిత హెచ్చరించారు. నిజం మాట్లాడే వాళ్లదే తప్పు అన్నట్టుగా వీడియోలు ఎడిట్ చేసి ఎదురుదాడి చేస్తారా..? అని కవిత ప్రశ్నించారు. ప్రభుత్వానికి బాకాలు ఊదే వాళ్లు కూడా తాను ప్రైవేట్ ప్రాపర్టీలో ధర్నా ఎందుకు చేస్తున్నానని ప్రశ్నిస్తున్నారని మూసీ ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు కాబట్టే బాధ్యతాయుతమైన సంస్థగా హైదరాబాద్ ను పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మరోవైపు హైడ్రా పేదవాళ్ల ఇళ్లను కూల్చుతూ పెద్దవాళ్ల జోలికి వెళ్లటం లేదని కవిత మండిపడ్డారు. పేదవాళ్ల పక్షాన తాము కచ్చితంగా పోరాటం చేస్తామని చెప్పారు. హైడ్రాకు దమ్ముంటే తాను ఇప్పటి వరకు ఆధారాలతో సహా 6 కంప్లైంట్స్ చేశానని వాటిపై ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా సిగ్గు లేకుండా పోరాటం చేస్తున్న వారిపైనే తప్పుడు వీడియోలు చేస్తారా.? అని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం, హైడ్రా ఏమైనా గ్రాఫిక్స్ డిజైనర్లా.? కంటెంట్ క్రియేటర్లా.? అని కవిత ప్రశ్నించారు. తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడనని స్పష్టం చేశారు. గతేడాదిలో ఆదిత్య కన్ స్ట్రక్షన్స్ వాళ్లు నాలా కబ్జా చేశారని అన్నది రంగనాథ్ కాదా.? అని కవిత గుర్తు చేశారు. ప్రజందరికీ ఒకే రూల్ ఉండాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పేదలను కొట్టి పెద్దవాళ్లకు భూములు పంచుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

### మూసీ ప్రక్షాళనతో ప్రయోజనం ఏంటో చెప్పాలి?

అటు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజాధనం దోపిడీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కవిత అన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఇచ్చి న ప్రజెంటేషన్ లో ఎక్కడ కూడా మూసీ ప్రక్షాళన కారణంగా జరిగే మేలు ఏంటో చెప్పలేదని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంక్ కు తాకట్టు పెట్టేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టారని గతంలోనే తాను అసెంబ్లీలో చెప్పానని కవిత అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్ లో ఫేజ్-1 కే దాదాపు 6 వేల 5 వందల కోట్ల నుంచి 7 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఇచ్చారని.. కానీ ఆరు నెలల క్రితం మాత్రం 5, 641 కోట్లు అని చెప్పారన్నారు. ఆరు నెలల్లో 14 వందల కోట్లు ఎందుకు పెరిగిందో ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. పైగా ఈ ప్రాజెక్ట్ లో ఎస్టీపీల నిర్మాణం, మూసీలో మురుగు నీరు కలిసే 16 నాలాల ప్రస్తావన, పరిహారం గురించి మాట్లాడలేదని అన్నారు. అంటే వాటికి అదనంగా ఖర్చు చేయబోతున్నారని విమర్శించారు. ఇంతా చేస్తే అసలు ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఏం మేలు జరుగుతుందో అన్నది ప్రభుత్వం చెప్పలేకపోతుందన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ లో భాగంగా గత ప్రభుత్వం రివర్ బెడ్ లో 30 లక్షల స్వేర్ ఫీట్ల నిర్మాణం చేపడతామంటే అనుమతి ఇవ్వలేదన్న విషయాన్ని కవిత గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం ఫేజ్-1 లోనే 18 లక్షల స్క్వేర్ ఫీట్ల నిర్మాణం చేపడితే ఎలా అనుమతిచ్చారని..దీని వెనుక జరిగిన మాయాజాలం ఏంటనీ ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారితో కాకుండా రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడమేంటని కవిత అన్నారు. మూసీ ప్రక్షాళన జరగాలి కానీ అది ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మూసీ పరిరక్షణ అంటే అక్కడ ఆక్రమణలు జరగకుండా, వ్యర్థాలు మూసీలో కలవకుండా చూడాలని తెలిపారు.

### వెలుగుమట్లలో పోరాటం కొనసాగుతుంది..

మరోవైపు వెలుగుమట్లలో ప్రభుత్వం 750 ఇళ్లను కూల్చేసి అందులో సగం మందికి కూడా న్యాయం చేయటం లేదని కవిత ఆరోపించారు. బాధితుల ఇళ్లు కూల్చిన తర్వాత తాను, విశారదన్ మహారాజ్ చేసిన నిరవధిక దీక్షతో ప్రభుత్వం స్పందించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఐతే 350 కుటుంబాలకు మాత్రమే పట్టాలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు వారిలో సగం మందికి కూడా ఇవ్వటం లేదని తమ దృష్టి వచ్చిందని చెప్పారు. అదే విధంగా అక్కడున్న 31 ఎకరాలతో పాటు మరో 30 ఎకరాల భూదాన్ ల్యాండ్ ను ప్రభుత్వం పెద్దవాళ్లకు ఇచ్చే కుట్ర చేస్తుందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఈ నెల 17 న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేస్తామని చెప్పారు. వెలుగుమట్లలో బాధిత కుటుంబాల అందరికీ న్యాయం జరిగే వరకు వారికి ధర్మ సమాజ్ పార్టీ, జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ప్రతిపక్షాలకు ఆయుధంగా

# పుట్టా మహేష్ డ్రగ్స్ వ్యవహారం

పరిస్థితి వచ్చిందని విమర్శిస్తోంది. ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు దొరకడం రాష్ట్ర ప్రజలకు సిగ్గుచేటని, ఆయన ఎంపీగా కొనసాగే అర్హత లేదని వైసిపి నేతలు మండిపడుతున్నారు.

### చంద్రబాబుకు వైసీపీ డిమాండ్

సీఎం చంద్రబాబుకు దమ్ముంటే తక్షణమే పుట్ట మహేష్ ను టిడిపి నుండి బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల కూడా, చంద్రబాబు తక్షణం పుట్ట మహేష్ కుమార్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో ఏలూరు టిడిపి ఎంపీ దొరకడం సిగ్గుచేటు అన్నారు.

### చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని షర్మిల ప్రశ్న

ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే ఎంపీ ఇక్కడ కొకైన్ తో విందులు చిందులు చేస్తున్నాడని, ఇది ఎక్కడి బాధ్యతారాహిత్యం అంటూ వైయస్ షర్మిల టార్గెట్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిన తర్వాత చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని షర్మిల నిలదీశారు. డ్రగ్స్ తీసుకున్న ఎంపీ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని, యువత డ్రగ్స్ వాడాలని నేరుగా ప్రోత్సహిస్తున్నారా అంటూ ఆమె ప్రశ్నించారు.

### కఠిన చర్యల దిశగా చంద్రబాబు

పుట్ట మహేష్ పైన అనర్హత వేటు వేయాలని, పార్టీ నుండి వెంటనే సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న వేళ, తెలుగుదేశం పార్టీకి ఇది పెద్ద తలనొప్పిగా మారింది. గతంలో అవినీతి, నేరారోపణలు ఎదుర్కొన్న నేతల పైన చంద్రబాబు చర్యలు తీసుకున్న నేపథ్యం ఉన్న క్రమంలో, పుట్టా మహేష్ కుమార్ పై టీడీపీ కఠిన చర్యలకు సిద్ధమైంది.

### ఉపేక్షించేది లేదు.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చంద్రబాబు ఆదేశం

ఈ క్రమంలోనే ఏలూరు ఎంపి పుట్టా మహేష్ పై వచ్చిన ఆరోపణలను సీరియస్ గా తీసుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రగ్స్ వంటి ఘటనలో ఎవరు ఉన్న ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎంపీ పుట్ట మహేష్ కుమార్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. ఘటన పైన వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని, వ్యక్తులు, నేతలు తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని చంద్రబాబు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణుల మధ్య మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

జూలూరుపాడు : ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యల్లంకి సత్యనారాయణ నివాసం వద్ద పార్టీ శ్రేణులు ఈ వేడుకలను జరిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు యల్లంకి సత్యనారాయణ, జూలూరుపాడు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చాపలమడుగు రామ్మూర్తి కేక్ కట్ చేసి అక్కడున్న వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. నామా నాగేశ్వరరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ప్రజాసేవలో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన రాజకీయ ప్రస్థానాన్ని, నియోజకవర్గానికి చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# దుష్ప్రచారాలు నమ్మవద్దు

ఏ తప్పు చేయలేదు. కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ వెళ్ళాను. కలిసి తిరిగి వచ్చే సమయంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయి. ఆ విషయాలను ఎవ్వరూ నమ్మవద్దు. ఈ కేసులో పోలీసు విచారణకు పూర్తిగా సహకరిస్తాను. పూర్తి వివరాలతో త్వరలో ప్రజల ముందుకు వస్తానని' ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఎప్పటికైనా నిజం గెలుస్తుందని, తన విషయంలో ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు, అభిమానులకు టీడీపీ ఎంపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ సమావేశాలు జరగాలి

జిఏడి రాహుల్ బొజ్జా, ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ సెక్రటరీ (ఫైనాన్స్) సిక్తా పట్నాయక్, డీజీపీ శివధర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### అసెంబ్లీకి చెడ్డపేరు తీసుకురావద్దు

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు మార్చి 16 నుంచి ప్రారంభం అవుతున్నాయి అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు మంచిగా జరుగుతాయి అని తెలిపారు.ం

'అనుకోని సంఘటనలు, అవాంచనీయ పరిస్థితులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వానికి, శాసనసభకు ఎలాంటి చెడ్డ పేరు రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి'అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు.

### పోలీస్ శాఖ సహకరించాలి

'శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలి'.సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయి'అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.

# 2027 పద్మ అవార్డులకు నామినేషన్లు ప్రారంభం

. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులను గుర్తించి నామినేట్ చేయాలని పౌరులను కోరింది. ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, సమాజానికి నిస్వార్థ సేవ చేస్తున్న వారిని గుర్తించి సిఫార్సు చేయాలని సూచించింది. పౌరులు తమకు తాముగా కూడా నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. జాతి, వృత్తి, హోదా, లింగ బేధాలు లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులే. అయితే, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు (వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా) వీటికి అనర్హులు.

# ఇది మీ ప్రభుత్వం,నేను మీ సోదరుడిని

### రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు

'అన్ని మతాలకు చెందినవారు కలిసికట్టుగా సోదరభావంతో ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ ఇఫ్తార్ విందు సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి సాధ్యమైనంత మేరకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.'రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ అందరితో సత్సంబంధాలను కొనసాగించడమే రంజాన్ మాసం పవిత్రత'అని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో వెల్లడించారు.

### మైనారిటీల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

'రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కి మంత్రి పదవి, షబ్బీర్ అలీకి సలహాదారుగా, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీగా ఉద్యోగ కల్పించడమే కాకుండా 2 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.'8 మంది మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించాం'అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదరభావం తీసుకొచ్చి హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు సింహ భాగమిచ్చి ముందుకు నడిపిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### ఈ ప్రభుత్వం మనందరిదీ

'ఈ ప్రభుత్వం మనందరిదీ. నేను మీ సోదరుడిని. మనమందరం కలిసి తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. అందరం కలిసి కష్టపడితేనే ఈ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మీ అందరి సహకారం కావాలి'అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.'ఈ ఇఫ్తార్ విందులో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ కలకలం

పోలీసులను భయపెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీపై దాడులకు సంబంధించి ఈగల్ ఫోర్స్ ఎస్పీ ఆర్. గిరిధర్ మీడియాకు వివరాలను వెల్లడించారు.

### 11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..

"డ్రగ్స్ పార్టీ జరుగుతుందని సమాచారం మేరకు మేం రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై దాడి చేశాము. లోపలికి ప్రవేశించిన సమయంలో మా అధికారులకు కొన్ని శబ్దాలు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అక్కడికి చేరుకోగా, ఒక వ్యక్తి పిస్టల్ పట్టుకుని కనిపించాడు. మరొకరి వద్ద ఖాళీ తూటాలు ఉన్నాయి. వెంటనే అక్కడ ఉన్న 11 మందిని అదుపులోకి తీసుకున్నాం. వారికి నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ టెస్టులో ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. ఆసుపత్రిలో నిర్వహించిన రక్త నమూనాల పరీక్షల్లో మరో వ్యక్తి (టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్)కి కూడా పాజిటివ్ రావడంతో, మొత్తం ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది" అని ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ తెలిపారు.

### ముఖ్య నేతలు అరెస్ట్

పోలీసులు అదుపులోకి తీసుకున్న 11 మందిలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తొలుత పుట్టా మహేష్ యాదవ్‌కు నెగిటివ్ వచ్చినట్లు ప్రచారం జరిగినప్పటికీ, రక్త నమూనాల నివేదికలో ఆయనకు డ్రగ్స్ పాజిటివ్ అని తేలిందని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు.


### పోలీసులపై కాల్పులు జరిపారు.. చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్

అనుమతి లేకుండా ఒక ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతుందనే సమాచారంతో పోలీసులు శనివారం రాత్రి 9:30 గంటలకు రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌కు వెళ్లి ఆకస్మిక దాడులు నిర్వహించారని చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ తెలిపారు. 'పోలీసులు అక్కడికి చేరుకోగానే, ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమిత్ శర్మ గన్‌తో ఒక రౌండ్ కాల్పులు జరిపాడు. రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డికి చెందిన ఆ తుపాకీకి లైసెన్స్ ఉంది. అయితే, కాల్పులు జరిపింది మాత్రం నమిత్ శర్మ. పార్టీలో 2 గ్రాముల తెల్లటి పొడి (డ్రగ్స్) కూడా పోలీసులకు లభ్యమైంది. అక్కడ ఒక మహిళ సహా మొత్తం 10 మంది ఉన్నారు. వారిలో ప్రజా ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. ఆ 10 మందిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, రితేష్ రెడ్డి, శ్రవణ్ కుమార్, నమిత్ మిశ్రా, ఎం. రమేష్, విజయ్ కృష్ణ, రవి, అర్జున్ రెడ్డి ఉన్నారు. వీరిలో ఐదుగురు రోహిత్ రెడ్డి, నమిత్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం వారందరినీ అదనపు శాంపిల్ పరీక్షలకు పంపాం. పూర్తి నివేదికలు వచ్చాక చట్టపరమైన చర్యలు ఉంటాయని' చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు.

# డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం

కేటీఆర్, మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ తాను స్వీకరిస్తున్నానని, డ్రగ్స్ టెస్టుకైనా తాను సిద్ధమని ప్రకటించారు. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు అందరూ స్వచ్ఛందంగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు, మాజీ ప్రజాప్రతినిధులు డ్రగ్స్ వాడటం దురదృష్టకరమని, వ్యక్తిగతంగా తాను డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగించేది ఎంతటి వారైనా సరే, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో, ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేసినా ఈ కేసులోకి లాగాలని చూస్తే కనుక చట్టపరమైన నోటీసులు ఇస్తానని కేటీఆర్ హెచ్చరించారు. కేటీఆర్‌పై గతంలో రేవంత్ రెడ్డి పలుమార్లు ఆరోపణలు చేశారు. తన బొచ్చు కూడా ఇస్తాను టెస్టులు చేపించుకోవాలని మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ బదులిచ్చారు. ఎలాంటి డ్రగ్స్ టెస్టులకైనా సిద్ధమేనని, అయితే నిరాధార ఆరోపణలు చేసినా, తన పరువుకు భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేస్తే కనుక చట్టప్రకారం పరువునష్టం దావా వేసి నోటీసులు పంపిస్తానని గతంలో చెప్పిన మాటలను కేటీఆర్ మరోసారి గుర్తుచేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీ నిర్వహించడంతో పార్టీకి చెందిన మరికొందరు నేతలు, కేటీఆర్ అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. డ్రగ్స్ తానెప్పుడూ తీసుకోలేదని, ఎప్పుడైనా సరే టెస్టులకు వెనుకాడనని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు.

# కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి



గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కృషి వల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని, ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రికార్డును ఆమె ప్రశ్నించారు.

## కట్టా వెంకటరమణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చాపల వెంకటేశ్వర్లు



ఓజిలి (ప్రశ్న న్యూస్) నాయుడుపేట పట్టణంలోని మాతృశ్రీ అపార్ట్‌మెంట్‌లోని తన నివాసంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు చాపల వెంకటేశ్వర్లు విచ్చేసి, కట్టా వెంకటరమణారెడ్డికి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కట్టా వెంకటరమణారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షల వెల్లువ కురిపించారు.

## పోలేరమ్మ జాతరను విజయవంతం చేయండి

**- ప్రజా సంఘాల నాయకులు చాపల వెంకటేశ్వర్లు**



ఓజిలి (ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లా నాయుడుపేట లో ప్రసిద్ధి గాంచిన నాయుడుపేట గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను భక్తులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు చాపల వెంకటేశ్వర్లు కోరారు.ఆదివారం విన్నమాల పెద్దకాపుకు తాంబూలాల ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమే 5, 6 తేదీల్లో జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుందని తెలిపారు. ఏప్రిల్ 17న మొదటి చాటింపుతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో భాగంగా, మే 5న నిలుపు ఉత్సవం, మే 6న ప్రధాన జాతర జరుగుతాయని వివరించారు.జాతర ఎటువంటి అవాంతరాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి కావాలని, భక్తులందరూ స్వచ్ఛందంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ అంకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ బూత్ కన్వీనర్ కల్లూరు శ్రీనివాసులు



ఓజిలి (ప్రశ్న న్యూస్) చిలమత్తూరు గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కూలీల మేస్త్రి కల్లూరు వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ టీడీపీ బూత్ కన్వీనర్ కల్లూరు శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అనంతరం ఎల్ల సిరి భజన బృందం వారు ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక గీతాలు, లయబద్ధమైన కోలాట నృత్యాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ఈ కార్యక్రమంలోపెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పెండింగ్లో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేయాలి

**- బిసి విద్యార్థి జేఏసీ బొల్లెపల్లి స్వామి గౌడ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)బిసి విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఇందిర పార్క్ వద్ద ఏర్పాటు చేసిన విద్యార్థి పోరు ఫీజు దీక్షను నిర్వహించారు.ఈ సందర్భంగా బిసి విద్యార్థి జేఏసీ బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేయాలని కాలేజీల యాజమాన్యల దృష్టిలో కాకుండ లక్షలది మంది విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మూసి సుందరీకరణ , గాంధీ విగ్రహం పేరుతో 5 వేల కోట్ల ప్రజాధనని వృధా చేసే బదులు విద్యార్థుల చదువుల కోసం 10 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తే విద్యార్థుల జీవితాలు రోడ్డు పాలు కావాని ప్రభుత్వానికి హితువు పలికారు లేకుంటే ప్రభుత్వం వైఖరిలో మార్పు రాకుంటే విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని జరగబోయే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని బొల్లెపల్లి స్వామి గౌడ్ హెచ్చరించారు.ఈ దీక్షలో ముఖ్య అతిథులుగా బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిజెపి ఎంపీ ఈటల రాజేందర్, టిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎల్ రమణ, వి శ్రీనివాస్ గౌడ్, సిపిఐ నేత ఈటి నరసింహ పాల్గొన్ని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాగరాజు, మధు యాదవ్,సత్యరాజ్, వెంకటేష్, తారకేశ్వరి,సంధ్య ,స్వర్ణ,భవానీ,ఇంద్రం,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై అక్రమ పార్కింగ్

## ట్రాఫిక్‌కు పెద్ద తలనొప్పి

- పెద్ద అంబర్పేట్ పిస్తా హౌస్ నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి
- ట్రాఫిక్ పోలీసుల ఆదేశాలు పట్టించుకోని యాజమాన్యం
- వాహనదారుల ప్రాణాలకు ముప్పు
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్





**పెద్దఅంబర్ పేట (ప్రశ్న న్యూస్)** పెద్ద అంబర్ పేట ప్రాంతంలోని ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఉన్న పిస్తా హౌస్ వద్ద హైవేపై జరుగుతున్న అక్రమ వాహనాల పార్కింగ్ తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతోంది. రహదారి పక్కనే వరుసగా వాహనాలు నిలిపివేయడంతో హైవేపై రాకపోకలు స్తంభించి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.ప్రతిరోజూ వందలాది వాహనాలు



పిస్తా హౌస్ వద్దకు రావడంతో హైవేనే పార్కింగ్ స్థలంగా మార్చేశారు. రహదారి పక్కనే కాకుండా నేరుగా హైవేపై వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వేగంగా వెళ్లే వాహనాలు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సిన పరిస్థితి రావడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం పెరిగిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు హెచ్చరికలు చేసినప్పటికీ పిస్తా హౌస్ నిర్వాహకులు వాటిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటే సమస్యకు చెక్..

ఎక్కడైనా పార్క్ చేసుకుంటాం, అంతా మా ఇష్టం అన్నట్లు పిస్తా హౌస్ యాజమాన్యం వ్యవహరిస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైవేపై ట్రాఫిక్ నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.హైవేపై అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ జామ్‌లు రోజువారీ సమస్యగా మారాయి. కొద్ది నిమిషాల ప్రయాణం చేయాల్సిన వాహనదారులు అరగంటల పాటు



ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. అత్యవసర సేవల వాహనాలు కూడా ఇక్కడ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



హైవేపై అక్రమంగా పార్క్ చేసిన వాహనాలపై వెంటనే చలాన్ వేయడంతో పాటు వాటిని తొలగించాలని, కావాలని ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తున్న వారిపై భారీ జరిమానాలు విధించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా హైవేను పార్కింగ్ స్థలంగా మార్చడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇప్పటికైన ట్రాఫిక్ పోలీస్ ఉన్నత అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు చెక్ పెట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో

# ఉగాది పంచాంగం ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా : బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. క్యాంపు కార్యాలయంలో బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు గంగు ఉపేంద్రశర్మ, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అయినవోలు వెంకట సత్యమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుదిమల్ల శ్రీనివాసాచార్యులు, లలిత గాయత్రి సేవా సహకార సంస్థ నాయకులు చకిలం సుధాకర్‌రావు పంచాంగ సిద్ధాంతకర్త వి.బాలకృష్ణశర్మ, దశమహావిద్య ఉపాసకులు పంచాంగకర్తతో కలిపి పంచాంగావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాంగకర్తలు ప్రజల శ్రేయస్సుకు మేలుకోరి మనోభీష్టాలను నెరవేర్చేవిధంగా ఉండాలని, విభిన్నాభిప్రాయాలు ఉండకూడదని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమైన పండుగలు సమ్మక్క-సారలమ్మ జాతర, బతుకమ్మ పండుగ, దసరా ఉత్సవాలు ఇవే చాలా ప్రాముఖ్యమైన పండుగలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయినవోలు వెంకట సత్యమోహన్ మాట్లాడుతూ పంచాంగాలు గుణించే సిద్ధాంతులు ఒకచోట సమావేశమై కాలానుగుణంగా సిద్ధాంతపరంగా ముహూర్తాలు పండుగల విషయంలో ఏకాభిప్రాయంతో నిర్ణయం జరగడంలేదని అన్నారు. అందరూ సిద్ధాంతులే కాని అవగాహన లోపంతో ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఒక వేదిక ఏర్పాటు చేసుకొని రాష్ట్రస్థాయిలో ఉన్న సిద్ధాంతులు,



పంచాంగకర్తలు గ్రామాల్లో ఉన్న పురోహితులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు, చాత్తాద శ్రీవైష్ణవులు, పద్మ పురోహితులు ఇతర వర్గాలు కూడా పంచాంగాలు ముద్రిస్తున్నారని, వారి పంచాంగాలను కూడా రాష్ట్ర సిద్ధాంతులు పరిగణలోకి తీసుకొని వారి అభిప్రాయాలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. పండుగల విషయంలో కూడా గందరగోళాలు చెలరేగుతున్నాయని, హిందువుల పండుగల పట్ల అభిప్రాయభేదాలు ఉండకుండా పంచాంగాలు ముద్రించాలని సూచించారు.

## ఎల్పీజీ కొరత.. ప్రభుత్వ పాఠశాలలో

# అన్నం బదులు పానీపూరీలు..

ఔవర్ దీవఅస్త్రుశ్రీ : ఎల్పీజీ కొరత దేశమంతా ఉన్న సంగతి తెలిసిందే. ఎల్పీజీ సిలిండర్ల కొరత ప్రభావం ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనంపై కూడా పడింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఎల్పీజీ కొరత కారణంగా విద్యార్థులకు అన్నం బదులు పానీపూరీ (గోల్‌గప్పా)లు వడ్డించడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది.కమర్షియల్ సిలిండర్లపై విద్యార్థులకు స్థానికంగా పాఠశాలల్లోనే వంట చేసి వడ్డిస్తుంటారు. అయితే, ఇటీవల ఇరాన్ సంక్షోభం కారణంగా దేశంలో ఎల్పీజీ కొరత తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగాల్‌లోని భద్రకాళి పాఠశాలలో కూడా ఎల్పీజీ కొరత కారణంగా రెగ్యులర్ మధ్యాహ్న భోజనం అందించడం వీలు కాలేదు. దీంతో విద్యార్థులకు పానీపూరీలు అందించారు. దీనికి ఎక్కువ గ్యాస్ అవసరం ఉండదనే సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి విడుదలైన వీడియోలో పిల్లలు వరుసగా నిలబడి తమ ప్లేట్లలో పానీపూరీలు తీసుకెళ్లారు. అక్కడి ఒక అసిస్టెంట్ టీచర్ దీన్ని వీడియో తీసి తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. మిలియన్‌కు పైగా వ్యూస్ దక్కించుకుంది. దీనిపై ఆన్‌లైన్‌లో విస్తృత చర్చ జరుగుతోంది.పిల్లలకు ఆహారం ఇవ్వలేని సందర్భంలో గోల్‌గప్పాలు ఏర్పాటు చేసి మంచి పని చేశారని, పానీపూరీలు తింటుంటే పిల్లల మొహంలో ఆనందం కనిపిస్తుందని కొందరు అంటుంటే.. ఎన్ని





పానీపూరీలు తిన్నా రెగ్యులర్ మీల్ తిన్నట్లుగా ఆకలి తీరదని, పోషకాలు అందవని కొందరు అంటున్నారు. ఏదేమైనా దేశంలో ఎల్పీజీ కొరత సాధారణ జీవనంపై ఎంతలా ప్రభావితం చేస్తుందో ఈ ఘటన నిరూపిస్తోంది.

# బూరుగుపల్లి, భూపతిపూర్ గ్రామాల మృతుల కుటుంబాలను పరామర్శించిన

## మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జాతీయ రహదారి రాంపూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటానని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఆదివారం రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన కలాలి అమృత గౌడ్, రిషి వర్ధన్ గౌడ్,బి.భూపతిపూర్ గ్రామానికి చెందిన గోకని సాయ గౌడ్ మృతి చెందారు.. వారి ఇద్దరి పిల్లలకు 25 వేల చొప్పున 50 వేల రూపాయలు ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు డాక్టర్ మైనంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యే ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆదివారం రెండు కుటుంబాలను పరామర్శించారు.భూపతిపూర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన భార్య, తల్లిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు.కుటుంబ సభ్యుల బాధను చూసి కూడా భావోద్వేగానికి ఆయన గురయ్యారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు.రెండు గ్రామాల మృతదేహాల అంత్యక్రియల ఖర్చులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు భరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురాం గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ సాయిలు, మండల పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, బాలకిషన్ రావ్, సాయి బాబా, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా యువత అభివృద్ధి కోసం వినియోగించాలి






తార్నాక(ప్రశ్న న్యూస్) క్రీడలను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా యువత అభివృద్ధి కోసం వినియోగించాలని, ఐపీఎల్ పేరుతో క్రీడాకారులను సంతలో సరుకుల్లా కొనుగోలు చేసే క్రీడా వ్యాపారాన్ని అరికట్టాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ ) జాతీయ నాయకులు, సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ నారాయణ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సీ గ్రౌండ్స్ లో 12నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ టోర్నీ కు నారాయణ, కుమార్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.క్రీడాకారులతో కరచాలనం చేసి, ప్లేయర్లతో మ్యాచ్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా నారాయణ, ప్రొఫెసర్ కుమార్ లు మాట్లాడుతూ దేశ యువతలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు, శిక్షణా కేంద్రాలు, క్రీడా సదుపాయాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. భగత్ సింగ్ వంటి విప్లవ వీరుల ఆశయాలు యువతకు ప్రేరణ కావాలని పేర్కొన్న నారాయణ, యువత క్రీడలు, విద్య, సామాజిక బాధ్యతల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడలను కూడా వ్యాపారంగా మార్చి బెట్టింగ్ యాప్స్, మాదకద్రవ్యాల సంస్కృతి యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలు, బెట్టింగ్ సంస్కృతి వంటి సామాజిక దుష్ప్రభావాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఐక్యత, పోరాటస్ఫూర్తి పెంపొందించే గొప్ప సాధనమని అన్నారు. భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ యువతలో చైతన్యం కలిగించే మంచి కార్యక్రమమని ఆయన అభినందించారు. గ్రామ స్థాయి నుండి క్రీడలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వాలదే అని స్పష్టం చేశారు. ఐపీఎల్ పేరుతో క్రీడాకారులను సంతలో సరుకుల్లా కొనుగోలు చేసే క్రీడా వ్యాపారాన్ని అరికట్టాలన్నారు. దేశంలో క్రీడలను అభివృద్ధి పరచాల్సిన పరిస్థితిలో, ప్రస్తుతం క్రీడలను పూర్తిగా వ్యాపారంగా మార్చే ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్,ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్,రాజ్ కుమార్, మహేష్, భాను, హైదరాబాద్ జిల్లా నాయకురాలు సక్రి భాయి, హరీష్ లతో క్రీడాకారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయ గౌడ్‌కు నివాళులర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హవేలీఘనపూర్ మండలం బోగూడ భూపతిపూర్ గ్రామానికి చెందిన గోకని సాయ గౌడ్ మృతి చెందారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి.ఆదివారం బోగూడ భూపతిపూర్ గ్రామానికి చేరుకొని గోకని సాయ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య, తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యుల బాధను చూసి పద్మదేవేందర్ రెడ్డి కూడా భావోద్వేగానికి గురయ్యారు.రోడ్డు ప్రమాదంలో సాయ గౌడ్ మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు.అనంతరం సాయ గౌడ్, బూరుగుపల్లి అమృత్ గౌడ్ కుటుంబానికి చెరో 10,000/- చొప్పున రూ.20,000/- ఆర్థిక సహాయం చేశారు. వీరి వెంట నాయకులు రాఘవ రెడ్డి, జీవన్ రెడ్డి,యాదగిరి, లక్ష్మీపతి, అరవింద్, కుమార్, సంతూ, శ్రీశైలం, మ్యాకల సాయిలు, సాప. సాయిలు, రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## పంచముఖ హనుమాన్, బొడ్రాయి గ్రామదేవతల ప్రతిష్ట మహోత్సవములకు ఆహ్వానం





పటాన్‌చెరు( ప్రశ్న న్యూస్)గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన 42 అడుగుల శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌ను విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యుడు ఎస్ విజయ్ గౌడ్, మాదారం కౌన్సిలర్లు మల్లేష్ ముదిరాజ్, స్వాతి గణేష్ సింగ్, ప్రజా ప్రతినిధులు భాస్కర్ యాదవ్, గడ్డమీది గణేష్, సుదర్శన్, ఆంజనేయులు, సిహెచ్ గణేష్ రజక, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. గడ్డపోతారం పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డు చౌదరి గూడెం గ్రామంలో ఏప్రిల్ 3న నిర్వహించనున్న బొడ్రాయి గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆలయ కమిటీ చైర్మన్ నల్లగండ్ల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు చైర్మన్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పిల్లల ఈత సరదా తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగల్చవద్దు

## పిల్లలను ఒంటరిగా ఈతకు పంపొద్దు

## మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్: పిల్లలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. పిల్లలకు నీటి లోతు తెలియకపోవడం వల్ల జారి నీటిలో పడిపోయే ప్రమాదాలుజరుగుతున్నాయని తెలిపారు.కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఒకవేళ పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల సరదా తల్లిదండ్రులకు జీవితాంతం మిగిలే విషాదంగా మారకూడదని అన్నారు.గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని చదువు లేదా ఇతర మంచి విషయాలు నేర్పించాలని ఆయన సూచించారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) పటాన్‌చెరు నియోజకవర్గంలోని క్యాసారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రివర్యులు హరీష్ రావు గారి సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీష్ అన్న మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజలకు, కార్యకర్తలకు అండగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం,అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ముఖ్య లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి సమన్వయం చేసిన పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ఎప్పటికీ అండగా నిలుస్తుందని ఆయన అన్నారు.మాజీ జెడ్పిటిసి గడిల శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ చేసిన సేవలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. మాజీ మంత్రివర్యులు హరీష్ రావు నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పార్టీలో చేరిన నాయకులు కార్యకర్తలు ప్రజల సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మల్లేశ్ గౌడ్, ధనుంజయ్ గౌడ్, అరవింద్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, కార్తిక్ యాదవ్ తదితరులు తమ అనుచరులతో కలిసి సుమారు 30 మంది సభ్యులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఇతర బీఆర్ఎస్ నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలి: ఎస్పీ సునీల్ షోరాణ్

**జిల్లా వ్యాప్తంగా 130 పరీక్షా కేంద్రాల ఏర్పాటు.**

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.**

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు.**



నంద్యాల(ప్రశ్న న్యూస్) జిల్లా వ్యాప్తంగా 130 పరీక్ష కేంద్రాలలో సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం12.45 గంటల వరకు నిర్వహించనున్న సందర్భంగా పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరుపున అన్ని పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు.

పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పోలీ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు.

## కార్మిక హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

**- అన్నవరపు ప్రభాకర్**

**మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం మహాసభలు, రాజమండ్రికి భారీగా తరలిరండి**

**మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మహాసభలే వేదిక**

**ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలి.**




మంగళగిరి (ప్రశ్న న్యూస్) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని కార్మిక హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి, కార్మికులకు పని గంటలను పెంచుతున్నప్పటికీ, వేతనాలను మాత్రం పెంచడం లేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆదివారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నందం బ్రహ్మేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో, సరైన భద్రతా సదుపాయాలు లేకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వము వారి సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని కోరారు.అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న సి.పి.ఎస్. (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ కార్మికులను 62 సంవత్సరాలు నిండిన తరువాతనే రిటైర్ చేయాలని,వారికి గ్రాట్యూటీ, పెన్షన్ వంటి సంక్షేమ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆప్కోస్ కార్మికునిగా పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ముద్రబోయిన కృష్ణ, వేల్పూరి తులసీదాస్, ధూపాటి రాయుడు, గండికోట సీతయ్య, చేబ్రోలు రంగా, కలవకొల్లు కృష్ణ, సుహాసిని, రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## పూల సుగంధాలతో అలరించిన శ్రీవారి సప్తవర్ణ పుష్పయాగం



శ్రీనివాసమంగాపురం(ప్రశ్న న్యూస్) శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 7 నుండి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం కన్నులపండుగగా నిర్వహించారు. 12 రకాల పుష్పాలు, 6 రకాల ఆకులతో స్వామివారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను ఉపయోగించారు. పుష్పయాగానికి 4 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి పుష్పాలు విరాళంగా అందాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్ పాల్గొన్నారు.

# సినీ ఇండస్ట్రీలో చేదు అనుభవం..

## దర్శకుడి ప్రవర్తన నచ్చక సినిమా వదిలేశా: లావణ్య త్రిపాఠి

సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే హీరోయిన్ లావణ్య త్రిపాఠి తాజాగా సినీ పరిశ్రమలో తనకు ఎదురైన ఒక చేదు అనుభవం గురించి మాట్లాడి సంచలనం రేపింది. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉండే చీకటి కోణాలు, మహిళలు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కరోనా సమయంలో తాను ఒక తమిళ సినిమా ఒప్పుకున్నానని లావణ్య త్రిపాఠి వెల్లడించింది. అయితే ఆ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడి ప్రవర్తన తనకు ఏమాత్రం నచ్చలేదని ఆమె తెలిపింది. షూటింగ్ స్పాట్‌లో తాను సురక్షితంగా లేనట్టుగా అనిపించడంతో పాటు అసౌకర్యంగా భావించానని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ధైర్యంగా ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నానని లావణ్య చెప్పింది. అయితే సినిమా నుంచి బయటకు వచ్చిన తర్వాత పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని ఆమె తెలిపింది. సదరు దర్శకుడు, నిర్మాతలు తనను టార్గెట్ చేసి పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించారని, అంతేకాకుండా తనపై కేసులు కూడా పెట్టారని ఆమె ఆరోపించింది. ఆ సమయంలో తనకు ఎవరూ మద్దతుగా నిలవలేదని, తీవ్ర మానసిక వేదనను అనుభవించానని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో నెటిజన్లు, సినీ అభిమానులు ఈ అంశంపై చర్చిస్తున్నారు. ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై మరోసారి చర్చ మొదలైంది. ఇక లావణ్య త్రిపాఠి సినిమాల విషయానికి వస్తే, మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం తర్వాత ఆమె నటిస్తున్న తొలి చిత్రం 'సతీ లీలావతి'. ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్నారు. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. వాస్తవానికి ఈ నెలలోనే సినిమా విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



# 33 వేలతో సినిమా

## 'తుంబాడ్' దర్శకుడి సంచలనం



ఇప్పుడు సినీ నిర్మాణం అంటే కోట్లతో కూడుకున్న వ్యవహారం. కొత్త ఆర్టిస్టులతో ఓ చిన్న సినిమా తీయాలన్నా కోటి రూపాయలకుపైగా ఖర్చు చేయాల్సిందే. అలాంటిది కేవలం 33 వేలతో సినిమా తీసి చూపించారు బాలీవుడ్ దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఈ బడ్జెట్‌తో షార్ట్‌ఫిల్మ్ తీయడం కష్టతరమైన నేటి పరిస్థితుల్లో ఆయన ఏకంగా ఫీచర్ ఫిల్మ్ తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. రాహి అనిల్ బార్వే ఎవరో కాదు..'తుంబాడ్' వంటి మిస్టరీ థ్రిల్లర్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడాయన. ఇప్పుడు 'మన్-పిశాచ్' పేరుతో కేవలం ఇద్దరు నటులతో ఆయన ప్రయోగం చేశారు. ఈ సైకలాజికల్ హారర్ డ్రామాను యానియా భరద్వాజ్, దీపక్ దమ్లే అనే ఇద్దరు నటులతో 80 నిమిషాల నిడివితో తెరకెక్కించారు. 'మన్-పిశాచ్' స్క్రిప్ట్ 60 పేజీలు. ఈ సినిమా కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం తీసుకున్నారు. చేతితో గీసిన స్టోరీ బోర్డులు, ఐఫోన్‌లో తీసిన వీడియో రికార్డింగ్స్, ఫొటోషాప్, జనరేటివ్ ఏఐ ఉపయోగించిన ఈ సినిమాను పూర్తి చేశారు.పురావస్తు శాఖకు చెందిన అధికారి సదాశివరావ్..హడమ్‌గాన్ అనే ఒక ఊరికి వెళతాడు. కొండలోంచి బయటపడ్డ పెద్ద గుమ్మటం రహస్యం తెలుసుకునేందుకు పరిశోధన మొదలుపెడతాడు. అక్కడ సావిత్రి అనే వితంతువు ఇంట్లో ఆశ్రయం పొందుతాడు. రాత్రి కాగానే ఆ గ్రామంలో చోటుచేసుకునే భయానక అనుభవాలే 'మన్-పిశాచ్' కథ. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు.కేవలం 33 వేలతో ఆ స్థాయి క్వాలిటీతో సినిమా తీయడం అద్భుతమని ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో కృతిమ మేధ (ఏఐ) సినిమా నిర్మాణాన్ని ఏ స్థాయిలో ప్రభావితం చేస్తుందనడానికి ఈ సినిమా ఒక ఉదాహరణ అని చెబుతున్నారు. పట్టుదల, తపన ఉంటే ఓ కళాకారుడు శూన్యం నుంచి కూడా అద్భుతాలు సృష్టించగలడని, అందుకు ఈ సినిమా ప్రయోగమే సాక్ష్యమని దర్శకుడు అనిల్ బార్వే తెలిపారు. ఈ చిత్రాన్ని యూట్యూబ్‌లో విడుదల చేయబోతున్నారు.



# బాలీవుడ్‌లో మరో ఆఫర్

'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కీర్తి సురేష్. ఆ సినిమా ఫెయిల్యూర్‌గా నిలిచినా ఈ భామ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా కీర్తి సురేష్ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. రాజ్‌కుమార్ రావుతో కలిసి ఆమె 'రాఫ్తార్' అనే చిత్రంలో నటించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించనున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. షూటింగ్ ప్రారంభించామని, జూలైలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. విద్యా వ్యవస్థ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, ప్రేమకథకు కూడా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్‌లో కనిపిస్తుందని, బాలీవుడ్‌లో ఆమె కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసారి పర్‌ఫార్మెన్స్ బద్దలైపోద్ది!

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా న టించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ పోలీస్ యాక్షన్ డ్రామా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. పవర్‌ఫుల్ యాక్షన్, పంచ్ డైలాగ్‌లు, చక్కటి వినోదంతో ట్రైలర్ ఆసాంతం ఆకట్టుకుంది. పవన్‌కల్యాణ్ తన ట్రేడ్ మార్క్ మేనరిజం, డైలాగ్స్‌తో అదరగొట్టాడు.'సంతోషంగా ఉండటం




అంటే మన జీవితాన్ని మనం లైక్ చేయడం.. మన జీవితానికి ఎవడెవడో లైక్‌లు కొట్టడం కాదు', 'ఉస్తాద్ భగత్‌సింగ్...ఇచ్చిపడేసే గోత్రం, ఇరగదీసే నక్షత్రం', 'ఈసారి పర్‌ఫార్మెన్స్ బద్దలైపోద్ది..' అంటూ పవన్‌కల్యాణ్ చెప్పిన సంభాషణలు హైలైట్‌గా నిలిచాయి. మాస్, కమర్షియల్ అంశాలను పర్‌ఫెక్ట్‌గా కలబోసి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతున్నది. శ్రీలీల, రాశీఖన్నా, పార్థిబన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నేపథ్య సంగీతం: తమన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్ ఎస్.



# గుర్తింపు ఇక్కడి నుంచే రావాలి

'ఇంట గెలిచి.. రచ్చ గెలవాలి' అంటారు. కానీ, తమ విషయంలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నదని అస్సాం నటి సుకన్య బోరువా వాపోతున్నది. తాము బయట గుర్తింపు దక్కించుకున్నా.. స్వదేశంలో మాత్రం నిరాధరణే లభిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ముఖ్యంగా, సినీ పరిశ్రమలో ఈశాన్య రాష్ట్రాలకు రావాల్సినంత గుర్తింపు దక్కడంలేదని ఆరోపిస్తున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సుకన్య.. తమ ప్రాంతాలపై చిన్నచూపు వద్దని కోరింది. "ఈశాన్య రాష్ట్రాలకు దేశవ్యాప్తంగా గౌరవం లభించాలంటే.. అంతర్జాతీయ గుర్తింపు అవసరం లేదు. అది ఇంట్లోనే ప్రారంభం కావాలి. కానీ, ఇక్కడ అలా జరగడం లేదు. ఈ విషయమే మమ్మల్ని నిరాశకు గురిచేస్తున్నది. సిగ్గుచేటుగా అనిపిస్తున్నది" అంటూ ఆవేదన వ్యక్తంచేసింది. రిమాదాస్ దర్శకత్వంలో వచ్చిన 'నాట్ ఏ హీరో' సినిమాలో కీలకపాత్రలో కనిపించింది సుకన్య బోరువా. ఈ సినిమా 2026 బెర్లిన్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో క్రిస్టల్ బేర్ అవార్డును గెలుచుకున్నది. ఒక అస్సామీ చిత్రానికి అంతర్జాతీయంగా గుర్తింపు దక్కినా.. స్వదేశంలో మాత్రం పట్టించుకోవడం లేదని సుకన్య చెప్పుకొచ్చింది. తమ ప్రతిభను గుర్తించడం లేదని వెల్లడించింది.

"ఎవరు ఎంత పక్షపాతం చూపినా.. 'కళ'ను మాత్రం అడ్డుకోలేరు. అది నిత్యం ప్రయాణిస్తూనే ఉంటుంది. స్వరాలు ఖండాలు దాటి వినిపిస్తాయి. మన గుర్తింపును ఎవరూ అడ్డుకోలేరని నిరూపిస్తాయి" అంటూ చెప్పుకొచ్చింది. ఈశాన్య రాష్ట్రాల కళాకారులు ప్రపంచ వేదికలపై గుర్తింపు పొందడం గర్వకారణమనీ, అదే సమయంలో ఒక పెద్ద వాస్తవికతనూ ఈ సంఘటన గుర్తు చేస్తుందని వెల్లడించింది. "తరతరాలుగా మా ప్రాంతం ప్రధాన స్రవంతి కథనాలలో విస్మరణకు గురవుతూ వస్తున్నది. అదే సమయంలో ఈశాన్య ప్రాంతాలు శక్తివంతమైన కథలు, సంగీతం, సినిమాలలో ప్రతిభను చూపుతూనే ఉన్నాయి. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. మాకు రావాల్సిన గుర్తింపు అదే వస్తుంది" అంటూ ఆశాభావం వ్యక్తం చేసింది. అస్సాం రాష్ట్రానికి చెందిన సుకన్య బోరువా.. నటి, మోడల్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. పలు హిందీ ప్రాజెక్టులలోనూ పాలుపంచుకున్నది. 2021లో వచ్చిన 'నిమా డెంజోంగ్పా' చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 'నాట్ ఏ హీరో'తో మంచి గుర్తింపు అందుకున్నది.

## గ్రామ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకం

- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం
- స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్
- పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు - సానిటేషన్ సామగ్రి పంపిణీ - సన్మానం




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ఆక్షన్ ప్లాన్ షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, యూనిఫామ్‌లు, పండ్లు, సానిటేషన్ సామాగ్రి అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామాన్ని శు భ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో వారు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వారి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని భావించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన యూనిఫామ్‌లు, సానిటేషన్ సామాగ్రి అందజేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్య సిబ్బంది సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తామని, వారికి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, బొంగాని శ్రావణ్ కుమార్, అక్కెనపల్లి మధుకర్, వివిధ సంఘాల నాయకులు చిలుముల రమేష్, గంగాధర వెంకటరమణ, ఎర్ర గంగయ్య, కొట్టేపల్లి అనిల్, మహిళా సంఘాల కో-ఆర్డినేటర్, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ సేవలకు శ్రీకారం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ స్పెషలిస్ట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నుండి ఒక గైనకాలజిస్ట్ డాక్టర్‌ను డెప్యూటేషన్ ప్రాతిపదికన శుక్రవారం నియమించారు. శనివారం ఉదయం నుంచే ఆసుపత్రిలో గైనకాలజీ స్పెషలిస్ట్ సేవలు ప్రారంభమైనట్లు మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు.

## మీడియా సమాజంలో కీలక పాత్ర పోషిస్తుంది

- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ కార్యవర్గం



**కొడిమ్యాల (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా ప్రతినిధులు సమాజానికి కీలక సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షులు బొక్కెన కృష్ణ కుమార్, గౌరవ అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అల్లావుద్దీన్, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా మట్టి తరలింపు

- రెండు టిప్పర్లు స్వాధీనం, కేసులు నమోదు
- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలంలోని పాత కొడుముంజ గ్రామం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్సై చల్లా వెంకట్రాజం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనాలు టీఎస్ 02 యూఏ 7028 (డ్రైవర్: వడ్డె కృష్ణ, యజమాని: చంద్రంపేట రమేష్),టీఎస్ 02 యూసీ 3653 (డ్రైవర్: లకావత్ సాయి కుమార్, యజమాని: లక్ష్మారెడ్డి)లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం మాట్లాడుతూ, అధికారుల అనుమతి లేకుండా మట్టి లేదా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గ్రామాభివృద్ధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాత్ర కీలకం

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య
- విలాసాగర్ గ్రామంలో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు - మాస్కులు, గ్లౌజులు పంపిణీ




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఆదివారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఘనంగా సన్మానం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బందిని శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. అదేవిధంగా ఆశా కార్యకర్తల సహకారంతో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం గ్లౌజులు, మాస్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగేందుకు పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి అందరూ కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మిడిదొడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ, జోగు శంకర్, దయ్యాల రేణుక, కొంకటి సతీష్, ఆశా కార్యకర్తలు సుజాత, నీరజ, నాయకులు సుంకపాక అనిల్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఏనుగుల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నెల రోజులపాటు నిర్వహించే ఉపవాసాల్లో ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అలియాబాద్, తుర్కపల్లి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ ముదిన్, ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మాలతి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహమ్మద్ షఫీ రుద్దిన్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గౌడవెల్లి లో రంజాన్ తోఫాలు పంపిణీ



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** జిహెచ్ఎంసి పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి లో ముస్లిం సోదరులకు, సోదరీమణులకు ప్రభుత్వం తరఫున రంజాన్ కానుక (తోఫా) లను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి, గౌడవెల్లి మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, గౌడవల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినోద్ గౌడ్ గారు, గౌడవల్లి గ్రామ మాజీ కోఆప్షన్ సభ్యులు గోపాల్, మాజీ వార్డు సభ్యులు నాగులూరి సుధాకర్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి లో ఘనంగా ఉగాది కవి సమ్మేళనం


- కవి సమ్మేళనం లో ఉగాది విశిష్టతను వివరించిన మున్సిపల్ చైర్మన్ : మైలారం లింబాద్రి



**మే పల్లి (ప్రశ్న న్యూస్)** ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనానికి జగిత్యాల జిల్లా, మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉగాది పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ కొత్త సంవత్సరం పట్టణ ప్రజలందరికీ సుఖసంతోషాలు, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది కవులు పాల్గొని తమ కవితలతో సభను ఆకట్టుకున్నారు. అలాగే కుమారి రవళి తన శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ కవిసమ్మేళనంలో బెజ్జారపు మురళి,మాసుల ప్రవీణ్ కుమార్ (కౌన్సిలర్), బొడ్ల నగేష్ (కౌన్సిలర్), జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నంబి రాజేంద్ర శర్మ, ప్రధాన కార్యదర్శి మర్రి భాస్కర్, మాడిశెట్టి భూలక్ష్మి, కట్కం కవిత, గుంటుక అశోక్, పెండెం శివానందం, సొప్పరి శ్రీనివాస్,గుర్రాల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తుల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- బీసీ సాధికారిత సంఘం నేతలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో రాజన్న దర్శనానికి వచ్చిన బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్ గారిని బీసీ నేతలు కొండ దేవయ్య పటేల్, పొలాస నరేందర్, ఇల్లందుల వెంకటేష్ తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల చేతి వృత్తులను పరిరక్షించి వాటికి పూర్వ వైభవం తీసుకురావాలంటే రేపటి అసెంబ్లీ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం పొలాస నరేందర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు పాలకవర్గాలను నియమించి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఉపాధి లేక అనేక మంది యువకులు గల్ఫ్ దేశాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రేపటి బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల వెంకటేష్ పట్టణ బీసీ సాధికారిత సంఘం ప్రధాన కార్యదర్శి సహా పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామంతపూర్ లో పూనం భవన లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మంది మహిళలకు వివిధ ఆటల పోటీలో నిర్వహించారు. బెలూన్ గేమ్, మ్యూజికల్ చైర్, తంబోలా, డాన్స్ ప్రోగ్రాం లక్కీ డీప్ , స్ట్రాస్ గేమ్స్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథులుగా వచ్చిన హై కోర్ట్ అడ్వకేట్ విజయలక్ష్మి , ఐద్వా నాయకురాలు నన్నపనేని సృజన, శ్రీనిధి మహిళా ఫౌండేషన్ పుష్పలత, సంతోషిమాత బోటిక్ రమాదేవి, డాక్టర్ దివ్య పరమేశ్వరి డెంటల్ హాస్పిటల్, ఫ్యాషన్ వింగ్స్ ఎంటర్ప్రైజెస్ సతీష్ క్యాటర్స్ మలబార్ గోల్డ్, వన్ స్టెప్ స్టీల్ ప్యాలెస్ ఉప్పల్, ఎక్సెంట్ జాబ్ ,ప్రజావాణి ప్రతినిధులతో కలసి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనిధి మహిళా ఫౌండేషన్ చైర్మన్ పుష్పలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రాజకీయంగా ఆర్థికంగా మహిళలు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం
- వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న విప్ ఆది





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలం,బొల్లారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవడం ప్రతి పేద కుటుంబానికి పెద్ద ఆనందమని, ఆ కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు అదిల్ పాషా, బొల్లారం మాజీ సర్పంచ్ మల్లేశం, ఉప సర్పంచ్ జావీద్, లింగంపల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుద్దాల కైలాసం, రణధీర్, దశరథం, నారాయణ, గోవర్ధనరెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముసపేట్‌లో "మూన్ రాక్"

# "50"కి పైగా కిరాయి దార్లు.?

- ముసపేట్ లో"మాస్ మహారాజ్ లు.?" ఈ జాబితాలో ఎంత మంది శ్రీమంతులు.?
- "ముసపేట్ లైన్లో మోసం ఎవరిది.?" అమాయకుల జీవితాలతో ఆడుకునే శ్రీకర్ ఎవరు.?
- లాస్ట్ లైన్లో లీస్ట్ తికమక లేక్క దొరకదు పక్కా"19,"39"లో "16"మంది అండ్ టెనేట్స్ తో బిజీ బిజీగా వ్యాపారం
- బోయిన్ పల్లి మార్కెట్లో ముసపేట్ లైన్లో:గ్రేన్ మార్చేంట్స్,కమీషన్ ఏజెంట్లు,
- "39"లైసెన్స్ దారులు కిరాయిలతో 3 పువ్వులు 6 కాయలతో వ్యాపారం
- నిజమైన వాడు"ఉచ్చలగాడ" నకిలీ,కిరాయి మహారాజులు, అదుర్స్ బాబులు
- సమస్యల కేంద్ర బిందువుగా ముసపేట్ లైన్,తల నొప్పిగా మారిన లాస్ట్ లైన్
- సమాధుల మీద గద్దల మోసాలు,వేపచెట్టు ఆత్మఘోషలు.మల్లయ్య, ప్రవీణ్ లీలలు






**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** జంటనగరాల్లో ప్రధానంగా ఉన్న మార్కెట్ యార్డ్ లల్లోఅంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సవాళ్ల ఒకటి కాదు రెండు కాదు కోకొల్లలుగా వెల్లువెత్తుతున్నాయి.ఉదాహరణకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అడిగెవాడు లేడని అప్పన్నంగ అందినకాడికి దండుకుంటున్నారు




కమీషన్ ఏజెంట్లు.వ్యవసాయ మార్కెటింగ్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.వీటిని కప్పిపుచ్చుకోవడానికి కమిటీలకు తాయిలాలు యిస్తూ,పంబం గడుపుతున్నారు.అయితే బోయిన్ పల్లి మార్కెట్ కి ఓ ప్రాధాన్యత ఓ రేంజ్ లో ఉంటుందని నలుగురికి తెలిసేలా గతంలో కమిటిలు వ్యవహరించారు.అదే నిజమని కొందరు ఆశల పల్లకిలో కోయిలమ్మలా కూతలు కూస్తున్నారు. ఇప్పుడు అదే శాపంగా మారిందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.అయితే దీంట్లో మూడు భాగాలుగా విభజించారు. మొదటిది కమీషన్ ఏజెంట్లు అత్యధికంగా వ్యాపారం చేస్తే పలువురికి కానుకలు ఇచ్చుకొక తప్పదు.ఒకవేళ ఎటువంటి మర్యదాలు సరిగ్గా లేకపోతే భవిష్యత్తులో ఏదో రకమైన కుత్రిమ సమస్యలు తలెత్తలా సృష్టిస్తారు.రెండోదిలైసెన్స్ దారులు తాను వ్యాపారం చేయక "కిరాయి"ల పై మోజు,లక్షల్లో ఆదాయం,మరి మాకేంటి అంటూ కొందరు బయట వాళ్లు తల దూర్చి తయ్ తక్క ఆటలో కొందర్ని బందీలు చేస్తూ వారి పంబంగడుపుకుంటున్నారు .ఇకమూడోది అసలైన సీసలైన బోయిన్ పల్లి మార్కెట్లో సమస్య 2013 లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ జారీ చేసిన "39"లైసెన్స్ లు పంచాయతీ. ఇప్పటికి దీని ద్వారానే మార్కెట్ లో పదిమందిని పరిషాన్ చేస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు మార్కెట్ అధికారులు. ఇలా వరుసగా మూడు విషయాలతో మార్కెట్ లో సమస్యలు తాండవం చేస్తుంటే అధికారులు ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అయితేముసపేట్ లైన్లో పంతోమ్మిది మంది కమీషన్ ఏజెంట్లు వారికి ఎదురుగా ఉన్న మార్కెట్ ప్రహరి గోడ ఆనుకొని ఉన్న వర్షపు నీరు కాలువ అనవసరంగా కంటోన్మెంట్ బోర్డు అధికారులు నేలమట్టం చేసి ఆ దుకాణం యజమానులకు స్వల్ప నష్టం కలిగించారు.ఈ విషయం పై కొన్ని రోజులు అధికారులు,కమిటీ,స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. చేసేది ఏమి లేక చెందాలతో కాలువ మరమత్తులు చేపట్టారు కమీషన్ దారులు. పూర్తి అయిన తర్వాత మేధావులు ఏం చేశారో తెలుస్తే షాక్ అవుతారు.అదేంటంటే కాలువ పై బిల్లలు వేసి కొంతమందికి కిరాయిలకు, మరికొందరైతే సొంతంగానే వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇక మరో విషయం ఏమిటంటే "39"మంది లైసెన్స్ దారులు "రూటే సపరేట్"బొందలనే మరోసారి సమాధి చేసి వాటిపై దందా చేస్తూ, కొందరికి కిరాయి ఇచ్చిన మేధావులు.ఉదాహరణకు అరటి కాయల మల్లయ్య: అర్ధాంతరంగా ముగిసిన నిర్మాణంలో వ్యాపారం చేస్తూ (అరటికాయలు,దొండకాయలు)మరో వైపు సమాధుల పై కిరాయికి ఇచ్చి టమోటా డిసిఎం వ్యాన్ తో పెద్ద దందా చేస్తున్నారు.ఇక రెండో వ్యక్తి పేరు:ప్రవీణ్ ఉత్తర ముఖాన సొంతంగా వ్యాపారంతో పాటు మరోకరికి కిరాయి, ఎదురుగా ఉన్న దక్షణం వైపు కూడా కిరాయికి ఇచ్చి క్యాష్ చేసుకుంటున్నప్రబుద్ధుడు.విక్రయించే కూరగాయలు..బీరకాయలు,మునకాళు ,,ఎదురుగా మిర్చి (సన్నాలు)శామగడ్డ, దోసకాయ జనరల్ ఐటమ్స్ తో రెచ్చిపోతున్నారు."సెక్రటరీ జీ జర దేకో సాబ్": బోయిన్ పల్లి మార్కెట్ లో బలవంతునిదే పై చెయ్యి అనడానికి ఈ అమాయకునిధీన గాథ!లక్షల రూపాయలతో వ్యాపారం చేస్తే అప్పులపాలై,వ్యాపారం సప్పగా.లైసెన్స్ ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు నిర్వహకం వల్ల ఓ అమాయకులు ఉచ్చలకుండి,మురికి కాలువ,చెత్త చెదారం వద్దనే వారి కేరాఫ్.అదే అధ్యక్షుడు ల్యాండ్ మార్క్ మాత్రం మార్కెట్ లోకి ఎంట్రీ అయిన తర్వాత మొదటి షాపు ఆయనదే.ఎంత సేపు ఆయన వద్దకు సమస్యతో వెళ్లిన పరిష్కారించని వ్యక్తి.వారికి మేము సవతి తల్లి పిల్లలుగా అభివర్ణిస్తున్నారని "39"లైసెన్స్ దారులు ఆవేదన చెందుతున్నారు.లైసెన్స్ లేని వ్యక్తులకు అసోసియేషన్ లో అవకాశాలు కల్పిస్తూ,ఆయనపీఠం చెయ్యి జారకుండా జాగ్రత్త పడుతున్నారు.మాకుమార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ వాస్తవం కాదా ? ఎందుకని మాపై ఇంత వివక్ష అంటూ నిలదీస్తున్నారు.మరో విషయం న్యాయం చేయాల్సిన అధికారులు మాత్రం కార్యాలయానికి పరిమితం అయ్యి అమాయకుల కంట తడికి బాధ్యులు అవుతున్నారు.ఇలా వేళ్ల మీద లెక్క పెట్టే వారి సంఖ్య ఎక్కువే!మరో విషయం ఏమిటంటే అదే లైన్లో ఇద్దరు మేధావులు ఉన్నారు.ఒకరికి చట్టంపై పూర్తి అవగాహన ఉంది.మరోకరికి చాకచక్యంగా వ్యవహరించే తెలివి తేటలు పుష్కలంగా ఉన్నాయి.అయిన కూడా వారికి నచ్చితేనే సమస్యలు భుజాలపై వేసుకుని వాదిస్తారు.లేకపోతే ఎడారిలో ఎండ మావులే ఇతరుల పరిస్థితి!కానీ అసలు విషయం తెలుస్తే అందరూ తలలు పట్టుకోవాల్సిందే అదేంటంటే "ముసపేట్ లైన్లో" వ్యాపారం చేసే వ్యక్తులు ఎవ్వరికీ ఎవ్వరు సంబంధం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.వీరికి తోడు రాజకీయ,అధికారుల,కమిటీ (గత కమిటీ) ముసుగులో చలామణి అవుతున్నారు. వీరిని కదిలిస్తే కనికరం లేకుండా కాల నాగులు అవుతారు.అసలు ముసపేట్ లైన్ ని జల్లెడ పడుతే కానీ మార్కెట్ తల రాత మారదుఇప్పటికైనా అధికారులు నిజాయితీ,నిష్పక్షపాతంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## హైడ్రా మరో భారీ ఆపరేషన్

- రూ.500 కోట్ల విలువైన భూమి స్వాధీనం
- కబ్జా కోరల్లోంచి రాంబాగ్ భూములు విముక్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా హైడ్రా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వేల కోట్ల విలువైన భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించింది. తాజాగా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌బాగ్‌లో రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా సిబ్బంది కాపాడారు. 6,427 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా.. స్పెషల్ ఆపరేషన్ చేపట్టి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు మధ్య ప్రభుత్వ స్థలంలో




అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించారు. అనంతరం ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

### చందానగర్‌లో 400ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

రెండ్రోజుల క్రితం శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. ఆ ప్రహరీనే పునాదులుగా చేసి ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. జీహెచ్ఎంసీ అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఈ మేరకు ఆక్రమణలు తొలగించి 400ల గజాల స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.ఇక ఎన్ఆర్ఎస్సి అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా హైడ్రాకు వజ్రాయుధం లా మారిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలకు సంబంధించిన సమాచారం ఒక్కో విధంగా ఉందని.. ఇలాంటి సమయంలో ఎన్ఆర్ఎస్‌సీ డేటా దిక్సూచిలా మారిందన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణలోనే కాదు ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల లెక్క తేల్చడంలో కూడా ఈ డేటా హైడ్రాకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు.

# మాజీమంత్రి హరీష్ రావు ఇలాకాలో అక్రమ రేషన్ బియ్యం దందా

- రైస్ మిల్లుల ముసుగులో భారీ రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం.?
- అధికారుల మౌనం వెనుక మామూళ్ల మాయాజాలం.?
- మాజీ మంత్రి హరీష్ రావు, కలెక్టర్ స్పందించాలని స్థానికుల విన్నపం



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందా మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాలోని సిద్దిపేట పరిధిలో రాయపోల్ మండలంలోని రామారావు గ్రామంలో రైస్ మిల్లుల పేరుతో భారీ స్థాయిలో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు తక్కువ ధరకే ఇవ్వాల్సిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ బియ్యం ఇక్కడ అక్రమంగా సేకరించి వ్యాపారం చేస్తున్నారనే ప్రచారం బలంగా వినిపిస్తోంది.

### రైస్ మిల్లుల ముసుగులో అక్రమ దందా.?

రామారావు గ్రామంలో మహాలక్ష్మి రైస్ మిల్ పేరుతో ఒక మిల్ నడుస్తుండగా, అదే ప్రాంతంలో పేరు లేకుండా మరో రైస్ మిల్ కూడా నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని మిల్లింగ్ చేయడం కంటే, అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి పెద్ద మొత్తాల్లో నిల్వ చేసి వ్యాపారం చేయడమే ఎక్కువగా జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### భారీ ప్రహరీ, హై సెక్యూరిటీ..


సాధారణంగా రైతులు ధాన్యం తీసుకొచ్చే రైస్ మిల్లులకు ఉండని విధంగా ఈ మిల్లుల చుట్టూ భారీ ప్రహరీ గోడలు నిర్మించారని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాదు ఎవరు లోపలికి వెళ్లకుండా హై సెక్యూరిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు తెలుస్తోంది."రైతులు వచ్చే సాధారణ రైస్ మిల్లుకు ఇంత బందోబస్తు ఎందుకు.?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మిల్లులో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు బయటకు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### జిల్లా సివిల్ సప్లై అధికారుల కనుసైగల్లో..

అక్రమ రేషన్ బియ్యం దందా గురించి స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, జిల్లా సివిల్ సప్లై అధికారులు, రెవిన్యూ అధికారుల నుండి ఎలాంటి చర్యలు కనిపించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రతి నెలా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే ప్రచారం కూడా ప్రాంతంలో జోరుగా సాగుతోంది. బహిరంగంగా వ్యాపారం నడుస్తున్నా అధికారులు చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### రాజకీయ అండదండలు.?

అక్రమ వ్యాపారం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే ప్రచారం కూడా స్థానికంగా వినిపిస్తోంది. ముఖ్యంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పేరు కూడా ఈ వ్యవహారంలో ప్రస్తావనకు వస్తుండటంతో విషయం మరింత చర్చనీయాంశంగా మారింది. ఆయన అండతోనే ఈ అక్రమ రేషన్ బియ్యం దందా నిర్భయంగా కొనసాగుతోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే ఇలాంటి అక్రమ వ్యాపారాలను హరీష్ రావు అస్సలు ప్రోత్సహించరని ఆయన పేరు చెప్పుకొని కొంతమంది రైస్ మిల్లర్లు ఇలా చేస్తున్నారని టిఆర్ఎస్ పార్టీలో చేరి ఆయన వెంట తిరుగుతూ అధికారులకు హరీష్ రావు అనుచరులం అంటూ అక్రమ రేషన్ బియ్యం దందా సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.





### ప్రభుత్వమేదైనా దందా ఆపేది లేదు..

బీఆర్ఎస్ ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వమైన మాకు లెక్క లేదు, మా అక్రమ దందా ఆపే ప్రసక్తే లేదు అన్నట్లు ప్రభుత్వానికి అధికార యంత్రంగానికే అక్రమ రేషన్ బియ్యం మాఫియా దారులు సవాల్ విసురుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.రైస్ మిల్లుల ముసుగులో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్న అధికారుల మౌనం ఎందుకని నెలనెలా మామూళ్లతో అధికారులు మౌనం వహిస్తున్నారా.?భారీ ప్రహరీ గోడలు, హై సెక్యూరిటీ సీసీ కెమెరాలు అక్రమ వ్యాపారం కోసమేనా.?ఈ వ్యవహారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, కలెక్టర్ ఎప్పుడు స్పందిస్తారు.? జిల్లా సివిల్ సప్లై అధికారులపై ఏం చర్యలు తీసుకుంటారు.? ప్రజలకు చెందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా వ్యాపారం పై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588